శుద్ధమైంది. మీ పాత్రని కడగకుండా వడ్డిస్తే అది తినడానికి పనికి రాకుండా పోతుంది.' అని నిరాకరిస్తాడు ఆ ధనవంతుడు.” మిగిలిన కథని చెప్పాను.

“ఇంతదాకా నాకు ఎలాంటి పేచీ లేదు. అసలు తప్పు సరిగ్గా ఇక్కడే రాసావు. సన్యాసి ఆ ధనవంతుడితో 'నీ మనసు కూడా నా భిక్షాపాత్ర లాంటిదే. అందులో స్వార్థం, లోభం, గర్వం, ద్వేషం, ధన వ్యామోహంలాంటి అనేక చెత్త నిండి వుంటే, శివ పంచాక్షరీ లాంటి పవిత్రమైన మంత్రం నీకు ఎలా ఇవ్వగలను?' అని ప్రశ్నించాడు సన్యాసి. అవునా?” వెంటనే తత్వవిదానంద స్వామి అందుకుని చెప్పాడు.

“అవును స్వామి! దాంతో జ్ఞానోదయం అయిన ఆ ధనవంతుడు త్వరలోనే తనలోని దుర్గుణాలని వదిలించుకుంటాడు. ఓ శుభోదయాన ఆ సన్యాసే ఆ ధనవంతుడింటికి వచ్చి అతనికి మంత్రదీక్ష ఇస్తాడు.”

“అది కదా ఆ కథ ద్వారా నువ్వు చెప్పదలచుకుంది. పిచ్చివాడా! పవిత్రుడైన ఆ ధనవంతుడికి అప్పుడు ఇక శివపంచాక్షరీ మంత్రంతో ఏం పని? అపవిత్ర దశలో వున్నవాడికే ఆ మంత్ర దీక్ష అవసరం. ఆ మంత్రాన్ని జపించగా, జపించగా అతనిలోని చెడు భావాలన్నిటినీ ఆ మంత్రం శుభ్రం చేసేస్తుంది. అశుభ్రంగా వున్న గదికి చీపురు ఎలా అవసరమో, అలా వివిధ దుర్గుణాలు గలవాడికే ఏదైనా మంత్ర దీక్ష అవసరం.” వివరించారు ఆయన.

## 25. అంధత్వం

ఓ గుడ్డి పిల్లవాడు రైల్వే ప్లాట్‌ఫాం మెట్ల మీద కూర్చుని, తన పక్కన ఓ చిన్న సత్తు పాత్రని వుంచాడు. ఆ పక్కనున్న చిన్న బోర్డు మీద ఇలా రాసి వుంది.

'నేను గుడ్డివాడ్ని. దయచేసి దానం చేయండి.'

ఆ సత్తు గిన్నెలో చాలా తక్కువ నాణాలు వుండటం అతని పక్క నించి వెళ్ళే ఒకతను చూసాడు. అతను ఆగి ఆ బోర్డు మీద రాసి వున్నది చదివి 'నేను గుడ్డి వాడ్ని' అన్న పదాలని కొట్టేసి అక్కడ ఇంకేదో రాసి వెళ్ళాడు. తర్వాత అతని సత్తు గిన్నెలో ఎప్పటికన్నా ఎక్కువ డబ్బు పడసాగింది. ఆ సాయంత్రం తిరిగి

వెళ్తున్న అతని అడుగులని బట్టి గుర్తించిన ఆ గుడ్డి బిచ్చగాడు అతన్ని ఆపి అడిగాడు.

"సార్. మీరు పొద్దున బోర్డు మీద ఏం రాసారు?"

"నేను అబద్ధం ఏం రాయలేదు. 'ఈ రోజు చాలా అందమైన రోజు. కాని దాన్ని నేను మీలా చూడలేను' అని రాసాను." జవాబు చెప్పాడు అతను.

ఆ గుడ్డివాడు రాసింది, అతను రాసింది ఒక్కటే అయినా ఇంకో పద్ధతిలో చెప్పాడు అతను. మొదటిది అతను గుడ్డివాడనే సమాచారాన్ని మాత్రమే ఇస్తే, రెండో దాంట్లో దాన్ని చదివినవారు ఎంతో అదృష్టవంతులని, వారు గుడ్డివారు కాదన్న సత్యాన్ని వాళ్ళకి గుర్తు చేస్తోంది. ఇతరులు తమకి చెప్తే కాని వారికి అది స్ఫురించలేదు.

ఇలాగే మనకున్న ఎన్నో వరాలని మనం గుర్తించలేక వాటి విషయాల్లో గుడ్డిగా వుంటాం. మనకున్నవన్నీ మనం గుర్తించగలిగితే మనం ఇంకాస్త సంతోషంగా వుంటాం.

## 26. దగ్గర దారి

వర్షాకాలంలోని ఓ సాయంత్రం ఓ సాధువు సముద్రపు ఒడ్డున నడుస్తున్నాడు. త్వరలో వర్షం పడే సూచనలు ఉండటంతో అక్కడ ఎవరూ లేరు- దైవ ధ్యానం చేసుకునే ఓ సాధకుడు తప్ప. తన దగ్గరకి ఆ సాధువు వచ్చాక ఆ సాధకుడు ఆయన్ని అడిగాడు.

"దైవ సాక్షాత్కార మార్గంలో ఎలా ప్రయాణించాలో నాకు దగ్గర దారిని బోధించగలరా?"

ఆ సాధువు అతని పక్కన ఆగి, ఓ సారి వెనక్కి తిరిగి చూసి చెప్పాడు.

"ఇసకలోని మన పాద ముద్రలని చూడు. నీ పాద ముద్రలు గమ్యం లేనట్లుగా అటు, ఇటు సాగాయి. సముద్రం నీళ్ళ దాకా వెళ్ళాయి. మళ్ళీ అక్కడ నించి చిన్న పిల్లలు ఆడుకునే రంగుల రాట్నం దగ్గరకి వెళ్ళాయి. మళ్ళీ అక్కడ నించి పిల్లలు ఇసకలో పాతిన ఓ కర్ర దగ్గరకి వెళ్ళాయి. ఆ తర్వాత ఇక్కడికి